# యోగాతో మధుమేహ కట్టడి

మధుమేహం దీర్ఘకాల సమస్య. ఒకసారి వచ్చిందంటే నయమయ్యేది కాదు. అదుపులో ఉంచుకోవటం తప్ప చేయగలిగిందేమీ లేదు. అందుకే దీని నివారణ ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఇందుకు యోగా ఎంతగానో తోడ్పడుతున్నట్టు రిసెర్చ్ సొసైటీ ఫర్ ది స్టడీ ఆఫ్ డయాబిటీస్ ఇన్ ఇండియా (ఆర్ఎస్ఎస్‌డీఐ) తాజా నివేదిక పేర్కొంటోంది. దీన్ని ఇటీవలే కేంద్ర ఆరోగ్యశాఖకు సమర్పించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, ఆర్ఎస్ఎస్‌డీ పూర్వ అధ్యక్షులు డా?? ఎస్.వి.మధు ఆధ్వర్యంలో మనదేశంలోని ఆరు ప్రధాన నగరాల్లో ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. మూడేళ్ల క్రితం ప్రాథమిక ఫలితాల్లోనే బయటపడ్డ యోగా గొప్పతనం తుది నివేదికతో మరింత సుస్పష్టమైంది.



మధుమేహ ముప్పు కారకాలనగానే ఆహారం, జన్యువులు, తగినంత శ్రమ చేయకపోవటం, అధిక బరువే గుర్తుకొస్తాయి. కానీ మానసిక ఒత్తిడీ తక్కువదేమీ కాదు. దీంతో సింపథెటిక్ నాడీ వ్యవస్థ, అడ్రినల్ గ్రంథి ఉత్తేజితమై రక్తంలోకి గ్లూకోజు ఎక్కువగా విడుదలవుతుంది. కణాల్లోకి గ్లూకోజు వెళ్లేలా చేసే ఇన్సులిన్ హార్మోన్ పనితీరు అస్తవ్యస్తమవుతుంది. అలాగే కార్టిజోల్ హార్మోన్ అధిక బరువుకు.. ముఖ్యంగా బొజ్జకు దోహదం చేస్తుంది. ఇది ఇన్సులిన్ నిరోధకతకు దారితీస్తుంది. ఫలితంగా రక్తంలో గ్లూకోజు మోతాదులు ఎక్కువై.. క్రమంగా మధుమేహం ముప్పు పెరుగుతుంది. ఇక్కడే యోగా ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఇది మానసిక ప్రశాంతతకు తోడ్పడుతుంది. యోగాతో కార్టిజోల్ మోతాదులు తగ్గటంతో పాటు ఇన్సులిన్ కూడా సమర్థంగా పనిచేస్తుంది. ఫలితంగా రక్తంలో గ్లూకోజూ బాగా అదుపులో ఉంటుంది. నెమ్మదిగా, లయబద్ధంగా వేసే ఆసనాలతో కండరాలకు రక్త సరఫరా పెరుగుతుంది. కండరాల్లో ఇన్సులిన్ గ్రాహకాల వ్యక్తీకరణ ఇనుమడించటం వల్ల గ్లూకోజును బాగా స్వీకరిస్తాయి. ఆసనాలతో నడుం, తుంటి చుట్టుకొలత నిష్పత్తి గణనీయంగా తగ్గుతుంది. క్లోమంలో ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాలు ఉత్తేజితమవుతాయి. ప్రాణాయామం, ధ్యానం వంటి వాటితో మానసిక ప్రశాంతత చేకూరుతుంది. నాడులు, జీవక్రియ వ్యవస్థలన్నీ సక్రమంగా పనిచేస్తాయి. ఇవన్నీ మధుమేహ నివారణకు ఉపయోగపడేవే. ఆర్ఎస్ఎస్‌డీఐ అధ్యయన ఫలితాలు ఇదే సూచిస్తున్నాయి. మధుమేహం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నవారికీ యోగాతో 40% వరకూ ముప్పు తగ్గుతున్నట్టు తేలటం గమనార్హం.

సాధన ఇలా..

ఆర్ఎస్ఎస్‌డీఐ అధ్యయనంలో పాటించిన యోగా ప్రణాళిక ఇదీ. ఆసనాలు వేయటం ముందు కష్టంగా అనిపించినా అలవాటైన కొద్దీ తేలికగా అవుతుంది. కొన్ని ఆసనాలను గర్భిణులు, అధిక రక్తపోటు గలవారు చేయరాదు. మెడ, మోకాళ్ల నొప్పుల వంటి సమస్యలు గలవారికి.. వయసు మీరినవారికీ జాగ్రత్త అవసరమే. కాబట్టి నిపుణుల సమక్షంలో నేర్చుకున్నాకే యోగా సాధన చేయాలి. ఆసనాలు వేస్తున్నప్పుడు మరీ కష్టంగా అనిపిస్తే వీలైనంత వరకూ ఆ భంగిమలో శరీరాన్ని వంచేలా చూసుకోవాలి. వయసు మీరినవారికి ఇది మరింత ముఖ్యం.

ధ్యానం- నిమిషం సేపు

సుఖాసనం లేదా పద్మాసనంలో కూర్చొని ఓంకారాన్ని జపించాలి.

త్రికోణాసనం- 6 సార్లు

పాదాలను ఎడంగా పెట్టి నిల్చొని, చేతులను రెండు వైపులకు చాచాలి. నడుమును పక్కకు వంచి ఎడమ చేత్తో కుడి పాదం వేళ్లను తాకి, కుడి చేతిని పైకి తిన్నగా చాచాలి. శ్వాస వదులుతూ తల పైకెత్తి కుడి చేయి చూడాలి. తర్వాత కుడి చేత్తో ఎడమ పాదం వేళ్లను తాకాలి. ఎడమ చేయిని పైకి తిన్నగా చాచాలి. శ్వాస వదులుతూ తలను పైకెత్తి ఎడమ చేయిని చూడాలి.

కటి చక్రాసనం- 6 సార్లు

పాదాలు దగ్గరగా పెట్టి, తిన్నగా నిల్చోవాలి. అరచేతులు ఒకదాంతో మరోటి చూసుకునేలా చేతులను తిన్నగా ముందుకు చాచాలి. శ్వాస వదులుతూ, నడుమును తిప్పుతూ నెమ్మదిగా కుడివైపునకు తిరగాలి. కుడి భుజం మీదుగా వెనకకు చూడాలి. చేతులను తాకించకుండా ఎడంగానే ఉండేలా చూసుకోవాలి. కాసేపు అలాగే ఉండి, శ్వాసను తీసుకుంటూ యథాస్థితికి రావాలి. ఇప్పుడు శ్వాస వదులుతూ, నడుమును తిప్పుతూ ఎడమవైపునకు తిరగాలి.

శవాసనం- 10 నిమిషాలు

ప్రశాంతంగా వెల్లకిలా పడుకోవాలి. కళ్లు మూసుకొని పాదాల దగ్గర్నుంచి తల వరకూ ఒకో అవయవం మీద దృష్టి సారిస్తూ అవన్నీ బాగా విశ్రాంతి పొందుతున్నట్టు భావించాలి.

సూర్య నమస్కారాలు- 9 సార్లు

ఇది 12 దశల్లో సాగుతుంది. ఇందులో ప్రణామ, హస్తోత్థాన, హస్తపాద, అశ్వసంచాలన, దండ, అష్టాంగ నమస్కార, భుజంగ, అదోముఖస్వాన, అశ్వ సంచాలన, హస్తపాద, హస్తోత్థాన, ప్రణామ ఆసనాలను ఒక క్రమంలో చేయాల్సి ఉంటుంది.

అర్ధమత్స్యేంద్రాసనం- ఒకవైపున ఒకోసారి

వజ్రాసనంలో కూర్చోవాలి. తర్వాత పిరుదులను కాస్త లేపి, ఎడమ వైపునకు జరిపి కూర్చోవాలి. కుడి పాదాన్ని ఎడమ మోకాలుకు అటువైపునకు తీసుకురావాలి. కుడి అరచేతిని వీపు వెనకగా నేలకు తాకించాలి. ఎడమ చేతిని కుడి మోకాలికి ఇటువైపు నుంచి తిప్పుతూ వేళ్లతో కుడి పాదం వేళ్లను పట్టుకోవాలి. శ్వాస వదులుతూ నడుము, భుజాలను కుడివైపునకు తిప్పాలి. తలను తిప్పి వెనక్కి చూడటానికి ప్రయత్నించాలి. శ్వాస తీసుకుంటూ యథాస్థితికి రావాలి.

పవన ముక్తాసనం- 4 సార్లు

వెల్లకిలా పడుకొని, కాళ్లు తిన్నగా చాచాలి. ఎడమ కాలు అలాగే ఉంచి, కుడి మోకాలును వంచి, తొడను పొట్టకు ఆనించాలి. చేతులతో కుడి మోకాలును పట్టుకొని, పొట్టకు అదమాలి. తల పైకెత్తి, శ్వాస వదులుతూ చుబుకంతో మోకాలును తాకటానికి ప్రయత్నించాలి. శ్వాస తీసుకుంటూ కుడి కాలును తిన్నగా చాచాలి. తర్వాత ఎడమ కాలుతోనూ ఇలాగే చేయాలి. తర్వాత రెండు మోకాళ్లను ఒకేసారి ఎత్తి, చేతులతో చుట్టేసి పొట్టను అదమాలి. తల పైకెత్తి చుబుకాన్ని మోకాళ్లను తాకించటానికి ప్రయత్నించాలి.

భుజంగాసనం- రెండు సార్లు

బోర్లా పడుకొని తలను నేలకు తాకించాలి. చేతులను భుజాల పక్కన ఉంచాలి. అర చేతులతో నేలను నొక్కుతూ తల, ఛాతీ, మొండాన్ని పైకి లేపాలి. కాళ్లు, కటి భాగం నేలకు తాకించి ఉంచాలి.

ధనురాసనం- రెండు సార్లు

బోర్లా పడుకొని కాళ్లు తిన్నగా చాచాలి. మోకాళ్లు వెనక్కు మడవాలి. రెండు చేతులతో రెండు మడమలను పట్టుకొని, శ్వాస తీసుకుంటూ తల, ఛాతీ, తొడలు, మోకాళ్లు, కాళ్లు, చేతులు పైకెత్తాలి. కాసేపు అలాగే ఉండి, శ్వాస వదులుతూ యథాస్థితికి రావాలి.

పాదచక్రాసనం- సవ్య, అపసవ్య దిశలో ఒక్కొక్కసారి

వెల్లకిలా పడుకొని, కాళ్లను తిన్నగా చాచాలి. అరచేతులను నేలకు తాకించాలి. మోకాలు వంచకుండా కుడి కాలును పైకి లేపి, సవ్య దిశలో గుండ్రంగా తిప్పాలి. తర్వాత అపసవ్య దిశలో గుండ్రంగా తిప్పాలి. ఎడమ కాలుతోనూ ఇలాగే చేయాలి.

ప్రాణాయామం

రేచకం, పూరకం- 20 సార్లు

పద్మాసనంలో లేదా సుఖాసనంలో కూర్చొని, కళ్లు మూసుకొని నెమ్మదిగా గాఢంగా శ్వాస తీసుకోవాలి. కొద్దిసేపు శ్వాసను ఆపి, నెమ్మదిగా వదలాలి.

భస్త్రిక- 5 సార్లు

నాలుగు సార్లు శ్వాసను వీలైనంత వేగంగా తీసుకొని, వదలాలి. తర్వాత ఒకసారి గాఢంగా శ్వాస తీసుకోవాలి.

అనులోమ విలోమ- 90 సెకండ్లు

ముక్కు కుడి రంధ్రాన్ని కుడి బొటన వేలితో మూసి ఎడమ రంధ్రంతో నెమ్మదిగా శ్వాస తీసుకోవాలి. మధ్య వేలితో ముక్కు ఎడమ రంధ్రాన్ని మూసి, కుడి రంధ్రంతో శ్వాస వదలాలి. అదే రంధ్రంతో శ్వాస తీసుకొని, కుడి బొటన వేలితో కుడి రంధ్రాన్ని మూసి ఎడమ రంధ్రంతో శ్వాస వదలాలి.

# దోమలు కుట్టకుండా..

వానాకాలంలో దోమల సంత విజృంభిస్తుంటుంది. ఇవి కుట్టకుండా చూసుకోవటం చాలా ముఖ్యం. లేకపోతే మలేరియా, డెంగీ, గన్యా వంటి జబ్బుల బారినపడే ప్రమాదముంది.

దోమలను తరిమే మలాములను చర్మానికి రాసుకోవాలి. ఇవి కళ్లు, నోటికి తగలకుండా



చూసుకోవాలి.

వదులైన, పొడవైన చేతుల చొక్కా, ప్యాంట్లు ధరించాలి.

సాయంత్ర వేళలో దోమలు చాలా చురుకుగా ఉంటాయి. ఈ సమయంలో మరింత జాగ్రత్త అవసరం.

ఇంట్లో, చుట్టుపక్కల నిల్వ నీరు లేకుండా చూసుకోవాలి. నీటి తొట్టిలపై మూత పెట్టుకోవాలి. కూలర్ల వంటివి ఖాళీ చేసుకోవాలి. పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాల వంటి వాటిని దూరంగా పారెయ్యాలి.

చెమటలోని ల్యాక్టిక్ ఆమ్లానికి దోమలు బాగా ఆకర్షితమవుతాయి. కాబట్టి శరీరం శుభ్రంగా ఉంచుకోవాలి.

పర్ఫ్యూమ్స్ వంటి పరిమళ ద్రవ్యాలకు దూరంగా ఉండటమే మంచిది. ఇవంటే దోమలకూ ఇష్టమే మరి.

ఇంట్లోకి దోమలు రాకుండా కిటికీలు మూసేయాలి. జాలీలు బిగించుకున్నా మంచిదే.

రాత్రిపూట మంచానికి దోమ తెరలు కట్టుకోవాలి. ఫ్యాన్ వేసుకున్నా మేలే.

చెత్తకుండీల మీద గట్టిగా మూత పెట్టుకోవాలి.

# సీఆర్‌పీ పరీక్ష సంగతేంటి?

డాక్టర్ దగ్గరికి వెళ్లినప్పుడు కొన్నిసార్లు సీఆర్‌పీ పరీక్ష చేయించుకోవాలని చెబుతుంటారు. దీని ఉద్దేశం రక్తంలో సి-రియాక్టివ్ ప్రొటీన్ (సీఆర్‌పీ) మోతాదులను తెలుసుకోవటం. వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) ప్రతిస్పందనలో భాగంగా కాలేయం




దీన్ని తయారు చేస్తుంటుంది. గాయాలు, ఇన్‌ఫెక్షన్లు, జబ్బుల వంటి వాటి నుంచి కాపాడుకోవటానికి, కోలుకోవటానికి శరీరం చేసే ప్రయత్నమే వాపు ప్రక్రియ. ఇది అప్పటికప్పుడు తలెత్తటం లేదా స్వల్పకాలం ఉండటం మేలు చేస్తుంది. ఉదాహరణకు- చర్మం కోసుకుపోతే అక్కడ ఎర్రబడటం, ఉబ్బటం దీని లక్షణాలే. ఇది ఇన్‌ఫెక్షన్‌ను నిలువరించే ప్రయత్నమే. శరీరంలో హానికారక క్రిములు, విషతుల్యాలను ఎదుర్కొనే క్రమంలోనూ ఇలాంటి ప్రతిస్పందనే తలెత్తుతుంది. అయితే వాపు ప్రక్రియ దీర్ఘకాలం కొనసాగుతూ వస్తుంటే ఆరోగ్యంగా ఉన్న కణజాలాన్నీ దెబ్బతీస్తుంది. ఇలాంటి రకం వాపు ప్రక్రియ సాధారణంగా స్వీయ రోగనిరోధక జబ్బుల్లో కనిపిస్తుంటుంది. కణజాలాలు అదేపనిగా గాయపడటం లేదా చిరాకుకు గురికావటంతోనూ దీర్ఘకాల వాపు ప్రక్రియ ప్రేరేపితం కావొచ్చు.

ఏం తెలుస్తుంది?

రక్తంలో సీఆర్‌పీ మోతాదులను బట్టి ఒంట్లో ఎంతవరకూ వాపు ప్రక్రియ ఉందో బయటపడుతుంది. తక్షణ, దీర్ఘకాల సమస్యలకిది సూచిక. సీఆర్‌పీ ఎక్కువగా ఉంటే బ్యాక్టీరియా లేదా వైరల్ ఇన్‌ఫెక్షన్.. క్రాన్స్, అల్సరేటివ్ కొలైటిస్ వంటి పేగుపూత జబ్బులు.. ల్యూపస్, రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్ వంటి స్వీయ రోగనిరోధక సమస్యలు.. ఉబ్బసం వంటి ఊపిరితిత్తుల జబ్బులు ఉండొచ్చని అర్థం. పొగ తాగటం లేదా పర్యావరణ రసాయనాల మూలంగానూ సీఆర్‌పీ మోతాదులు పెరగొచ్చు.

# క్షణాల్లో సెప్సిస్ గుర్తింపు

సెప్సిస్ తీవ్ర సమస్య. ఇన్‌ఫెక్షన్‌కు శరీరం మరీ అతిగా స్పందించటం వల్ల తలెత్తే ఇది కణజాలాలు దెబ్బతినటానికి, అవయవాలు విఫలం కావటానికి దారితీస్తుంది. సత్వరం చికిత్స అందకపోతే ప్రాణాల మీదికీ రావొచ్చు. అందువల్ల దీన్ని సకాలంలో గుర్తించి, చికిత్స చేయటం చాలా ముఖ్యం. బ్యాక్టీరియా వెలుపలి పొర ద్వారా విడుదలయ్యే విషతుల్యాల (ఎండోటాక్సిన్స్) వంటి జీవ సూచికల ఆధారంగా సెప్సిస్‌ను కచ్చితంగా గుర్తించొచ్చు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాలికట్ శాస్త్రవేత్తలు దీని విషయంలో గొప్ప ముందడుగు వేశారు. సెప్సిస్‌ను అప్పటికప్పుడే, ఆసుపత్రుల్లో మంచం వద్దే గుర్తించగల చవకైన, చిన్న పరికరాన్ని రూపొందించారు. ఎనిమిది రకాల ఎలక్ట్రోకెమికల్ బయోసెన్సర్ చిప్, నానోపార్టికల్స్‌తో కూడిన ఇది చాలా వేగంగా ఎండోటాక్సిన్లను గుర్తిస్తుంది. కేవలం 10 నిమిషాల్లోనే ఫలితాలు వెలువడుతుండటం విశేషం.





# మెదడు ఆరోగ్యం జీవితాంత ప్రక్రియ

మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవటమనేది ఏదో ఒక్క రోజుకో, నిమిషానికో పరిమితం కాదు. ఇది జీవితాంత ప్రక్రియ. గర్భధారణకు ముందు: తల్లిదండ్రుల ఆరోగ్యం, అలవాట్లు పిల్లల మెదడును తీర్చిదిద్దుతాయి. అదీ గర్భం ధరించటానికి ముందు నుంచే. తల్లిదండ్రులు మంచి పోషకాహారం తినటం, వ్యాయామం చేయటం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవటం, జీవనశైలి గాడి తప్పకుండా చూసుకోవటం పిల్లల మెదడుకు బలమైన పునాది వేస్తాయి. గర్భధారణ, పుట్టిన తర్వాత: తల్లి శారీరక, భావోద్వేగ నియంత్రణ గర్భస్థ శిశువు మెదడు ఎదుగుదలలో కీలక పాత్ర పోషిస్తాయి. గర్భం ధరించినప్పుడు తగు పోషకాహారం తినటం, మానసిక ఒత్తిడిని నియంత్రించుకోవటం తల్లీ, బిడ్డ ఇద్దరినీ కాపాడతాయి.

# ఆ బీపీ తప్పు చేయొద్దు

ఇప్పుడు బీపీ మానిటర్ పరికరాలు విరివిగా అందుబాటులోకి వచ్చాయి. చాలా ఇళ్లలో ఇవి కనిపిస్తున్నాయి. కాకపోతే కొందరు వీటిని సొంత వైద్యానికి ఉపయోగించుకోవటమే చిక్కు తెచ్చి పెడుతోంది. రెండు, మూడు సార్లు రక్తపోటు నార్మల్‌గా ఉన్నట్టు తేలగానే మందులు మానేయటం.. బీపీ పెరగ్గానే మాత్ర వేసుకోవటం చేస్తుంటారు. ఇలాంటి తప్పు చేయొద్దు. బీపీ మానిటర్‌ను సక్రమంగా వాడుకోవాలి. డాక్టర్ చెబితే తప్ప మాటిమాటికీ పరీక్షించుకోవద్దు. రోజుకోసారి చూసుకుంటే చాలు. రక్తపోటు ఫలితాలను కాగితం మీద రాసుకొని, డాక్టర్ దగ్గరికి వెళ్లినప్పుడు చూపించాలి. అంతే తప్ప సొంతంగా మందులు మానెయ్యటం, మోతాదు తగ్గించటం చేయొద్దు. రక్తపోటు తరచూ పెరుగుతూ, తగ్గుతూ ఉంటే ఆరోగ్యానికి హాని చేస్తుంది.



Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Published & Printed at Sri Muktheswara Publications , D.No.42/51-3,
NGO Colony,Chinna Chowk, Kadapa.516002. Andhra Pradesh. Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI APTEL/2007/22497, Editor: Kesaram Penta Reddy